## క్లుప్తంగా

### వేదగిరిలో ధ్వజస్తంభానికి పూజలు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి విశేష పూజలను బుధవారం నిర్వహించారు. ధ్వజస్తంభం కాస్త ఒరిగి ఉండటంతో దేవాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు నూతనంగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దేవదాయ శాఖ, రెవెన్యూ, పోలీసులు, స్థానిక అధికారుల సమక్షంలో తొలగింపు పనులు చేపట్టారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ధ్వజస్తంభ దాత కాకాణి నరహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### బాలికపై లైంగిక దాడికి యత్నం

నెల్లూరు(క్రైమ్): బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన సమీపంలో తన ఇంట్లో 15 ఏళ్ల బాలిక ఈ నెల రెండో తేదీన ఒంటరిగా ఉండగా, అదే ప్రాంతానికి చెందిన శ్రీహరి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి పెద్దగా కేకలేయడంతో శ్రీహరి అక్కడి నుంచి పరారయ్యాడు. విషయాన్ని తన తల్లిదండ్రులకు బాలిక తెలియజేసింది. వారు తమ బంధువుల దృష్టికి తీసుకెళ్లి ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ రాజుకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### శాకంబరిగా రాజరాజేశ్వరి దర్శనం రేపు

నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా శుక్రవారం దర్శనమివ్వనున్నారని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

### ఘనంగా హౌసింగ్ కార్పొరేషన్ డే

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ, జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బందికి క్రీడా పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం రెడ్‌క్రాస్‌లో 21 మంది రక్తదానం చేశారు. హౌసింగ్ పీడీ నాగరాజు, కావలి ఈఈ రంగవరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(మినీబైపాస్): పదో తరగతి పరీక్షల్లో 500, ఇంటర్‌లో 900కు పైగా మార్కులను సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. నవాబుపేటలోని మద్దులూరి వీరరాఘవయ్య నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో పురస్కారాలను ఆగస్టు 8న అందజేయనున్నామని తెలిపారు. వివరాలకు 94404 52541, 99633 24585 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### పాఠశాలల బంద్ విజయవంతం

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల బంద్ జిల్లాలో బుధవారం విజయవంతమైందని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని పాఠశాలలను స్వచ్ఛందంగా మూసేయగా, మరికొన్నింటిని ఏబీవీపీ ఆధ్వర్యంలో మూయించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్, నేతలు చందు, రాహుల్, నరసింహ, సాయి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘ రాష్ట్ర కార్యదర్శి నరసింహరావు పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్ ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సంఘాల కమిటీ సమావేశాలను నగరంలో సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నామని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నామని పేర్కొన్నారు. సీఐటీయూ నేతలు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, చాంద్‌బాషా, రెహనాబేగం, కిన్నెరకుమార్, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

# అత్యుత్తమ బోధన.. ఉత్తమ ఫలితాలు

**పొదలకూరులోని డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తోంది. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం..ఉపాధ్యాయులు అంకిత భావంతో అత్యుత్తమ బోధనను అందిస్తుండడంతో పదోతరగతి విద్యార్థినులు క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. తద్వారా పాఠశాలను రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలుపుతున్నారు.**



డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల



అడ్మిషన్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయినులు(ఫైల్)

పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. పాఠశాలలోని అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు.. క్రమశిక్షణ కలిగిన విద్యార్థినులు ఉండడంతో జిల్లాతో పాటు రాష్ట్రంలోనూ పాఠశాల గుర్తింపు పొందుతోంది. ఏటా పాఠశాలలో 800 మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్యాపరంగా జిల్లాలోనే రెండో స్థానంలో ఉంది. ప్రభుత్వం అమ్మఒడి నగదు అందజేయడంతో పాటు పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుండడంతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు.

**అదనపు తరగతి గదుల నిర్మాణం**

గతంలో డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడేవారు. తాగునీటి సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉండేది. ప్రభుత్వం మనబడి నాడు–నేడు కార్యక్రమం, నాబార్డు ద్వారా నిధులు మంజూరు చేయడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. అన్ని రకాల సౌకర్యాలు సమకూరడంతో విద్యార్థినుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పాఠశాలలో ఉపాధ్యాయినులే 30 మంది వరకు ఉన్నారు. ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరుతో పాఠశాల పునఃప్రారంభం రోజునే పుస్తకాలు పంపిణీ చేస్తుండడంతో పాటు ఉపాధ్యాయులు అంకితభావంతో బోధిస్తుండడంతో నాణ్యమైన విద్య లభిస్తోంది. జగన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థినులకు పౌష్టికాహారం అందిస్తుండడంతో మంచి ఆరోగ్యంతో చదువుపై దృష్టి సారిస్తున్నారు.

**ఆణిముత్యాలుగా ముగ్గురి ఎంపిక**

ఏటా పాఠశాలలో పదోతరగతిలో 150 మంది వరకు విద్యార్థినులు ఉంటున్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధనను అందిస్తుండడంతో విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో అచ్చి వైష్ణవి 592 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. ఆర్ తేజస్వినీ 584, కే సాయి భార్గవి 582 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ, తతీయస్థానాల్లో నిలిచి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. వైష్ణవి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆర్ తేజస్వినీ, కే సాయిభార్గవి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా జగనన్న ఆణిముత్యాలు నగదు పురస్కారాలను అందుకున్నారు. ఇదే స్ఫూర్తితో ఈ విద్యాసంవత్సరంలోనూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రయత్నిస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**నాణ్యమైన విద్యను అందిస్తున్నాం**



పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. అన్ని సబ్జెక్టులకు కొరత లేకుండా ఉపాధ్యాయులు ఉన్నారు. అందుకే పొదలకూరుతో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన పిల్లలను పాఠశాలలో చేరిస్తున్నారు.

–ఎం.పెర్సిస్, హెచ్‌ఎం.

**అన్ని సౌకర్యాలు కల్పించారు**



మా పాఠశాలలో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. ఉపాధ్యాయులు ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనం బాగుంది. ప్రభుత్వం పేద విద్యార్థులపై చూపిస్తున్న శ్రద్ధకు అనుగుణంగా మంచిమార్కులు సాధిస్తాం.

–బీ పెంచలలోహిత, పది విద్యార్థిని, బిరదవోలు.

**విద్యాకానుక కిట్లు అందాయి**



పాఠశాల ప్రారంభం రోజునే ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసింది. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేయడంతో చదువుకునేందుకు సులభంగా ఉంది. పాఠశాలలో విద్యాబోధన, వసతులు బాగున్నాయి.

–ఆర్.రేణుశ్రీ, పది విద్యార్థిని, పొదలకూరు.

**వసతులు బాగున్నాయి**



మా పాఠశాలలో వసతులు బాగున్నాయి. తరగతి గదులు సరిపోకపోవడంతో నిర్మిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నారు.

–ఆర్.శ్రీవిద్య,పది విద్యార్థిని, బ్రాహ్మణపల్లి

**నిరంతర పర్యవేక్షణ**



పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నాం. ఎలాంటి అవసరం ఉన్నా హెచ్ఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నాం. అందుకే పాఠశాలలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా, ఉత్తమ ఫలితాలతో జిల్లాస్థాయిలో గుర్తింపు పొందుతోంది.

– కందే సురేఖ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, పొదలకూరు

### నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ టీ నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆర్‌వైపాళెం, ఆ తర్వాత కనుపర్తి సచివాలయాల్లో జరిగే జగనన్న సురక్ష క్యాంపుల్లో పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తారని వివరించారు.

వెంకటాచలం: మండలంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మండల వెంకటశేషయ్య బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చవటపాళెం, 1.15 గంటలకు గొలగమూడి గ్రామ సచివాలయాల్లో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని వివరించారు.

మనుబోలు: మండలంలోని వీరంపల్లి సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరకాస్తుదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేసి జగనన్న సురక్షపై సమీక్షిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### డీటీ, వీఆర్వోల బదిలీ

మనుబోలు: మండల డిప్యూటీ తహసీల్దార్ బాట కోటమ్మ, కాగితాలపూరు వీఆర్వో రమేష్ బదిలీ అయ్యారు. డీటీ బాలకోటమ్మను కోవూరు మండల సీఎస్‌డీటీగా బదిలీ చేశారు. కాగితాలపూరు వీఆర్వో రమేష్‌ను ఇందుకూరుపేట మండలం లేబూరు బిట్–1 వీఆర్వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు రూరల్ మండలం పడారుపల్లి వీఆర్వో గండాల తేజను కాగితాలపూరుకు వీఆర్వో నియమించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్ బుజ్జమ్మ

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ) డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బుజ్జమ్మ మాట్లాడుతూ ప్రతినెలా మొదటి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులతో బొమ్మలు గీయించడం, తయారు చేయించడం, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## మడమనూరు హైస్కూల్ హెచ్‌ఎంగా రాధాకృష్ణ



హెచ్‌ఎంను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

మనుబోలు: మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వేదం వెంకటరాధాకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మస్తానయ్యను చేజర్ల మండల ఎంఈఓ–2గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో తోటపల్లిగూడూరు మండలం వరిగొండ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాధాకృష్ణను పదోన్నతిపై హెచ్‌ఎంగా ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణను గ్రామస్తులు, సహచర ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ గుమ్మా నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండూరు రామచంద్రారెడ్డి, జనార్దన్, ఆర్‌ఎంపీ పృథ్వీ, మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గీత కార్మికులను ఆదుకోవాలి



మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న గౌడ సేవాసమితి నాయకులు

ముత్తుకూరు: ప్రమాదవశాత్తు చనిపోయిన కల్లు గీత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం, జిల్లా గౌడ సేవా సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని తూర్పునాగలదొరువుకు చెందిన గీత కార్మికుడు కాల్తిరెడ్డి ఏడుకొండలు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మృతుడి భార్య సునీతమ్మకు రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్, అధ్యక్షుడు తోట ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నడవడి ముత్యంగౌడ్, ఉపాధ్యక్షులు ఉప్పాల రామకృష్ణయ్యగౌడ్, దద్దోలు రామచంద్రయ్యగౌడ్, పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న లేఅవుట్లో బోరు ఏర్పాటు



లేఅవుట్లో బోరు వేస్తున్న దృశ్యం

పొదలకూరు : మండలంలోని నేదురుమల్లిలోని జగనన్న కాలనీ లేఅవుట్లో బుధవారం బోరు నిర్మాణం చేపట్టారు. త్వరలో లేఅవుట్లో పక్కా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించనున్న నేపథ్యంలో బోరు వేసినట్లు సర్పంచ్ ఉడతా రమేష్ తెలిపారు. లేఅవుట్లో చుట్టుపక్కల ఎక్కడా పడని విధంగా పుష్కలంగా నీరు పడినట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో కనులపండువగా బుధవారం నిర్వహించారు. మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వేడుకగా జరిపారు. అన్నమయ్య సంకీర్తనలు, గోవిందనామ స్మరణతో మందిరం పులకించింది. ఉభయకర్తలుగా చిత్తూరు వెంకటేశ్వర్లు, రమణమ్మ దంపతులు వ్యవహరించారు.

### కుక్కలకు రేబీస్ టీకాలు

ఇందుకూరుపేట: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేయనున్నట్లు ఏడీ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కలతోపాటు వీధి కుక్కలకు సైతం టీకాలు వేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

### లారీ బోల్తా- డ్రైవర్‌కు గాయాలు

వెంకటాచలం: లారీ బోల్తా పడడంతో డ్రైవర్ స్వల్ప గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో బుధవారం వేకువన చోటు చేసుకుంది. వివరాలు..నెల్లూరు నుంచి గూడూరు వైపునకు వెళుతున్న లారీ కాకుటూరు సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు



పొదలకూరు : మరుపూరులో నూతనంగా నిర్మించిన కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వళ్లూరు గోపాల్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, అనపల్లి జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఆటో, బైక్ ఢీ

• ఇద్దరికి గాయాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు బస్టాండ్ సమీపంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటన బుధవారం జరిగింది. ప్రమాదంలో మర్రిపాడుకు చెందిన యర్రగంగు వెంకటేశ్వర్లు, గంగినేని వెంకట సుబ్బయ్యకు గాయాలు కావడంతో స్థానికులు వారిని మర్రిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స అందించారు.

### జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా అనంతలక్ష్మి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా అనంత లక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేస్తున్న శేషాద్రివాసు ఎంఈఓగా పదోన్నతిపై బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ముత్తుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనంతలక్ష్మి పదోన్నతిపై ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, చైర్మన్ తదితరులు శాలువా కప్పి పూలమాలవేసి అభినందించారు.

## జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న చిల్లకూరు సుధీర్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: అపరిష్కృత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పొట్లపూడి పంచాయతీలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్షలో భాగంగా సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను ఉచితంగా అందజేయనున్నట్లు వివరించారు. ఈ నెల 27వ తేదీ వరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్) మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి పథకం మోటార్ ప్రారంభం



మోటార్‌ను ప్రారంభిస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డు పుట్టవీధిలో తాగునీటి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మోటార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టవీధిలోని తాగునీటి సమస్యను కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో మంచినీటి మోటారును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ కన్వీనర్ యన్నమూరి నరసింహారావు, ఇంజినీరిగ్ అసిస్టెంట్ స్వరూప, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ ప్రహరీ ప్రారంభం



ప్రహరీని ప్రారంభిస్తున్న సీఈఓ శంకర్‌బాబు, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి

పొదలకూరు : పట్టణంలోని పొదలకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం చుట్టూ నిర్మించిన ప్రహరీని ఎన్‌డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రూ.5 లక్షలతో ప్రహరీని నిర్మించినట్లు తెలిపారు. సొసైటీ కార్యాలయ భవనానికి మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, డీజీఎం మధుసూదన్, పీఓడీ అలకూర్, బీఎం అగవాన్ పాల్గొన్నారు.

### వైభవంగా సాయినాథుడి గ్రామోత్సవం



సంగం: షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పూజల అనంతరం సాయినాథుడికి అత్యంత వైభవంగా మంగళవారం అర్ధరాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు. దువ్వూరు, వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెంతో పాటు సంగం పట్టణంలోని కొత్తూరు సాయిబాబా ఆలయాల్లోని సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తూరు, బలిజపాళెం, బజారువీధి మీదుగా గ్రామోత్సవంగా సాగారు. ఇళ్ల ముంగిటకు వచ్చిన సాయినాథుడికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

## ఎరువుల దుకాణాలపై దాడులు



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న ఆత్మకూరు ఏడీఏ దేవసేన

చేజర్ల: మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను ఆత్మకూరు ఏడీఏ దేవసేన బుధవారం తనిఖీ చేశారు. ఎరువులు అమ్మిన వెంటనే రైతులతో బయోమెట్రిక్ వేయించాలని, స్టాక్ బోర్డు డిస్‌ప్లే చేయాలని దుకాణదారులకు సూచించారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని ఆదేశించారు. మండలంలోని ఆదూరుపల్లి, చేజర్లకు చెందిన మార్క్‌ఫెడ్, సుబ్బలక్ష్మి ఫెర్టిలైజర్లు, పీఏసీఎస్, లక్ష్మీనరసింహ రైతు డిపో, వెంకటసుబ్రహ్మణ్యం రైతు డిపోల్లో స్టాక్ వివరాలను పరిశీలించారు. ఆమె వెంట చేజర్ల మండల వ్యవసాయ అధికారి శశిధర్ ఉన్నారు.